తెలుగు కళాసమితి మ్యాజెర్వీ ఉగాది కథల పోటీలో రూ. 300లు బహుమతి పొందిన కథ

# శేషప్రశ్న

—పి. సుబ్బలక్ష్మి

కాలింగ్ బెల్ నొక్కానేగాని కానిసమయంలో వచ్చానేమోనని కాస్త భయపడ్డాను.

"రా; రా.. మంచి సమయానికి వచ్చావు... ఈ ఉద్యోగం కూడా దొరక్క పోతే యింక నేను బ్రతకనంటూ యెలా మాట్లాడుతున్నాడో చూడు' అంటూ రవి తల్లి తలుపు తీసి ఆహ్వానించడంతో లోపలికి వెళ్ళాను. రవి సోఫాలో మోకాళ్ళ మీద మోచేతులానించి, రెండు చేతుల మధ్య ముఖాన్ని కప్పుకుని కూర్చుని వున్నాడు.

'నువ్వైనా వాడికి కాస్త ధైర్యం చెప్పు సారథీ!' జానకమ్మగారి మాటలకి రవి ప్రక్కగా వెళ్ళి సోఫాలో కూర్చుని భుజం మీద చెయ్యి వేశాను. 'రవీ.. మొన్నేదో కంపెనీలో క్లర్కు పోస్టుకి అప్లై చేశావు కదా? ఏమైంది?' అన్నాను.

రవి కళ్ళెత్తి నా వైపు చూశాడు... ఆ కళ్ళ నిండా నిరాశ గూడుకట్టుకుని వుంది... "ఉన్నదొక్క పోస్టు... దానికి తొంభై ఆరుగురు వచ్చారు ... వ్రాత పరీక్షలో సెలెక్టయిన వాళ్ళ పేర్లు నిన్ననే బోర్డు పెట్టారు. అందులో నా పేరు మెరిట్‌లో రెండవ స్థానంలో వుంది. కాని, ఏం లాభం? ఎవరో పి. రామారావుట! అతని పేరు మొదట వుంది. రేపు ఇంటర్వ్యూలు. అతనుగాని ఇంటర్వ్యూకి హాజరైతే నాకీ ఉద్యోగం కూడా రాదు. చేతికొచ్చిన అవకాశం అతనెందుకు వదులుకుంటాడు చెప్పు? అందుకే ఇంక ఈ ఉద్యోగం నాకు రాదని తేలిపోయింది. నేను ఇంటర్వ్యూకి కూడా వెళ్ళదలుచుకోలేదు" అన్నాడు బాధగా.

"చూడు సారథీ! ఆ తెలివితక్కువ మాటలు.. ఏదైనా ఆటంకం వచ్చి ఆ అబ్బాయి రేపు ఇంటర్వ్యూకి రాలేదనుకో. వీడికి ఉద్యోగం వచ్చే అవకాశం వుంది కదా? నువ్వైనా చెబితే వింటాడేమో చెప్పు. వెయ్యి దేముళ్ళకి మొక్కుకుంటున్నాను ఈ ఉద్యోగం వీడికే రావాలని" జానకమ్మగారి మాటలకి కించిదాశ్చర్యపోయాను. అంటే...? ఈవిడ పరోక్షంగా ఆ 'రామారావు'కి ఉద్యోగం రాకూడదని కోరుకుంటున్నట్లా?

ఒక అరగంట రవికి ధైర్యం చెప్పి ఇంటికి వచ్చేశాను.

** ** **

రాత్రి పది గంటలయింది.

అమ్మా, నాన్న ఏదో దీర్ఘంగా చర్చించుకుంటున్నారు. నాన్నగారు "వద్దు... అలా బాగుండదు" అంటున్నారు. అమ్మ "ఫర్వాలేదు... కాలాన్ని బట్టి మనం కూడా మన పద్ధతులని మార్చుకోవాలి. ముక్కు మూటిగానే పోతామంటే కొన్ని పనులు జరగవు" అని నచ్చజెప్పడానికి ప్రయత్నిస్తోంది.

ఇంటికి పెద్ద కొడుకుని కదా అంటీముట్టనట్టుంటే బాగుండదని నేనూ వెళ్ళి కూర్చున్నాను వాళ్ళ ప్రక్కనే. నేను అడగక్కర్లేకుండానే అమ్మ నాకు విషయమంతా వివరించింది.

"మీ చెల్లెలికి మంచి సంబంధం వుందిరా. వెళ్ళి మాట్లాడమంటుంటే.. వాళ్ళు రెండు రోజుల క్రితమే ఏదో సంబంధం చూసుకుని వచ్చారు... అమ్మాయి కూడా నచ్చింది... రేపో మాపో ముహూర్తాలు కూడా పెట్టుకుంటారు... ఇప్పుడు వెడితే ఏం బాగుంటుందంటారు మీ నాన్నగారు. బాగుండే దేమిటి? మన లలితకి అన్ని విధాలా తగిన సంబంధం. ఆస్తికి ఆస్తి, మంచి ఉద్యోగం, చక్కని రూపురేఖా... ఇవన్నీ వున్న సంబంధం కోసం రెండేళ్ళుగా చెప్పులరిగేలా తిరుగుతున్నా దొరుకుతోందా చెప్పు? ఆస్తి వుంటే, మంచి ఉద్యోగం వుండదు. ఈ రెండూ వుంటే అబ్బాయి నచ్చడం లేదు. అదేదో మనకి ముందు తెలిస్తే అసలు వాళ్ళు ఆ సంబంధం కోసం వెళ్ళకుండా మన లలితకే సెటిల్ చేసుకునేవాళ్ళం. ఎందుకో నాకు మాత్రం గట్టి నమ్మకముంది. నాన్నగారు వెళ్ళి మరో అయిదో, పదో (వేలు) ఎక్కువ ఇస్తామని ఆశ చూపిస్తే వాళ్ళు తప్పక వస్తారని... డబ్బుకి లొంగని వాళ్ళెవరుం



టారు చెప్పు? ఇంతకీ 'పెళ్ళి చూపులు' అయ్యాయి తప్ప నిశ్చయ తాంబూలాలు పుచ్చుకోలేదు. ఈ రోజుల్లో పీటల మీద పెళ్ళిళ్ళే ఆగిపోతున్నాయి. ఇదొక లెక్కా?" గుక్క త్రిప్పుకోకుండా అమ్మ చెప్పిన తీరు చెల్లెలికి 'ఆ' సంబంధం కుదరాలని అమ్మకి ఎంత పట్టుదలగా వుందో తెలియజెపుతోంది.

చివరికి మా నాన్నగారిని 'ప్రయత్నం చెయ్యడంలో నష్టం లేదు కదా?' అనే స్థితికి తీసుకువచ్చింది.

రవి ఇంట్లో జరిగిన సంఘటనకీ, ఇప్పుడు మా ఇంట్లో జరిగిన ఈ ఉదంతానికీ సాదృశ్యం కనిపించి నాలో నేనే నవ్వుకున్నాను.

** ** **

ఆ రోజు శనివారం. నేను ఆఫీసు నుండి తిరిగివస్తూ వుండగా ప్రక్కింటి అభిలాష్ పరిగెత్తుకుంటూ వచ్చాడు..."అంకుల్ ఈసారి రన్నింగ్ రేస్‌లో నేను ఫస్టు వచ్చాను... తెలుసా? ఇదిగో చూడు ఈ కప్ ఇచ్చారు"అన్నాడు చేతిలోని కప్‌ని చూపిస్తూ.

"వెరీ గుడ్.. ఎప్పుడూ సెకండ్, థర్డ్ వచ్చేవాడివి ఈసారి చూశావా పట్టుదలతో కృషి చేస్తే ఎలా ఫస్టు వచ్చావో?" అన్నాను అభిలాష్ వీపు మీద మెచ్చుకోలుగా తడుతూ. వాడు ఇచ్చిన సమాధానానికి మాత్రం నా తల తిరిగిపోయింది.

"అదేం కాదంకుల్... నేను ముందే చెప్పానుగా ఆ రాముగాడు పోటీలో వుంటే ఫస్టు వాడికే వస్తుంది... చాలా ఫాస్ట్‌గా పరుగెడతాడు. అందుకే ఈసారి వాడిని పోటీకి రాకుండా చెయ్యమని దేవుడికి దండం పెట్టుకున్నాను. గమ్మత్తుగా ఏమైందో తెలుసా? నిన్న బస్సు దిగుతున్నప్పుడు త్రొక్కిసలాటలో క్రిందపడిపోతే పాపం వాడి కాలికి ఫ్రాక్చర్ అయిందిట! వారం రోజుల దాకా కట్టు విప్పరట! అందుకే నాకు ఫస్టు ప్రయిజ్!"

అభిలాష్ వెళ్ళిపోయాడు కాని, నాలోని శేషప్రశ్న మళ్ళీ తలెత్తింది.

** ** **

ఇప్పుడు నాకు పెళ్ళి అయింది. ఇద్దరు పిల్లలు. ఉద్యోగరీత్యా హైదరాబాద్ ట్రాన్స్‌ఫర్ మీద వచ్చి ఇళ్ళ వేటలో పడ్డాను. నాకు ఆఫీసుకి దగ్గరగా, పిల్లల స్కూలుకి, బజారుకి అన్నింటికీ అందుబాటులో వుండే ఏరియాలో ఇల్లు ఖాళీ వుందని తెలిసి వెళ్ళాను. కానీ, నా దురదృష్టం... ఒక్క గంట క్రితం ఎవరో వచ్చి ఎడ్వాన్సు ఇచ్చి తాళం వేసుకుని వెళ్ళారని చెప్పాడు ఓనరు.

పది రోజులు వెతకగా, వెతకగా దొరికిన ఈ ఇల్లు కూడా చేజారిపోతున్నందుకు మనసంతా పాడైపోయింది. అప్పటికే ఫామిలీతో నా ఫ్రెండ్ ఇంట్లో తిష్టవేసి పదిహేను రోజులవుతోంది.

రాత్రి పడుకోబోయే ముందు మా శ్రీమతి అడిగిన ప్రశ్నకు గతుక్కుమన్నాను —"ఏదైనా కారణం వల్ల ఆ తాళం వేసుకున్న వాళ్ళు రాకపోతే మనకి ఆ ఇల్లు దొరికినట్టే కదండీ... దేముడికి గట్టి దండం పెట్టండి... నేనూ తిరుపతి వస్తానని మొక్కుకున్నాను."

శ్రీమతి ఆలోచన తప్పని తెలిసినా, తప్పనిసరి అని మాత్రం నా మనసు కన్పించింది. పడుకోబోయే ముందు చేసే దైవ ప్రార్థనలో ఆ 'కోరిక' చోటుచేసుకుందని వేరే చెప్పాలా?

** ** **

రవికి ఉద్యోగం వచ్చి ఇప్పుడు పెద్ద ఆఫీసరు ర్యాంకులో వున్నాడు... కానీ, ఆ రోజు ఇంటర్వ్యూకి వస్తున్న సి. రామారావు యాక్సిడెంట్‌లో శాశ్వతంగా రవి త్రోవలో నుంచి తప్పుకున్నాడని తెలిస్తే (మనసున్న) ఏ మనిషికైనా ఏ మూలో కలుక్కుమనక మానుతుందా?

మా చెల్లాయి లలిత 'ఆ సంబంధం' చేసుకుని పిల్లా పాపలతో హాయిగా వుంది. మరి ఆ సంబంధం తప్పిపోయిన అమ్మాయి సంగతి ఎవరైనా ఆలోచించారా? 'తాంబూలాల' వరకు వచ్చిన సంబంధం తప్పి పోయిందంటే అమ్మాయిలో ఏదో లోపం వుందని 'లోకం' పుకారు పుట్టించింది. ఫలితంగా ఆమె ఈ రోజు జీవచ్ఛవంలా బ్రతుకుతున్న నలభై ఏళ్ళ కన్య!

ఇంక అభిలాష్ సంగతి! తను ఫస్టు రావాలంటే ఎప్పుడూ ఫస్టు వచ్చే 'రామూ' పోటీలో పాల్గొకుండా వుండాలని దండం పెట్టుకున్నాడే కాని తను ఇంకాస్త పట్టుదలతో ప్రయత్నిద్దామని ఆలోచించలేదు.

మరి నేను? నేను కూడా అందుకు అతీతుడిని కాను. నేనూ మనిషినే కదా? మూడేళ్ళుగా ఈ ఇంట్లో అన్ని సుఖాలు అనుభవిస్తున్నాను... కాని, నా కంటే ముందు అడ్వాన్సు ఇచ్చిన వ్యక్తి ఆ ఊరు వచ్చిన ముహూర్తాన వున్న ఒక్క కొడుకు అకాల మరణం చెందాడనే బెంగతో మళ్ళీ తిరిగి ట్రాన్స్‌ఫర్‌కి పెట్టుకుని వెళ్ళిపోయాడని మీకు చెప్పకపోతే అది ఆత్మవంచనే అవుతుంది.

నాటికీ, నేటికీ నాకు జవాబు దొరకని ప్రశ్న ఒక్కటే! ఒక వ్యక్తి బాగుపడాలంటే... మరొక వ్యక్తి చెడిపోవాలా? ఒక వ్యక్తి లాభం పొందాలంటే మరో వ్యక్తి నష్టపోవాలా? ఎక్కడుంది లోపం? వ్యవస్థలోనా? మానవుడి ప్రవృత్తిలోనా?

'నా' అనే పదాన్ని నీ వాళ్ళకే పరిమితం చేయక అలా అలా విశ్వమంతా వ్యాపింపచేసినవాడు నీ ప్రశ్నకి సమాధానం తప్పకుండా దొరుకుతుంది... ఎవరో కాదు ... నాలోని అంతరాత్మ నొక్కి చెబుతోంది.. నిజమేనేమో?

●